మహతి ఇచ్చిన డబ్బును లెక్క పెట్టి “టోటల్ ట్వెల్వ్ థౌజండ్” అని పక్క నున్న క్లర్క్‌కి ఫార్మాలిటీస్ పూర్తిచెయ్యమని ఇచ్చి--

“వచ్చే నెల ట్వంటీటూ థౌజండ్ వేస్తారా?” నవ్వుతూ అడిగాడాయన.

“ఎయిటీ ఎయిట్ థౌజెండ్ కూడా వెయ్యొచ్చు ..... చెప్పలేను. లక్ కల్సిరావాలి. అంతే!”

మహతి అలా సాదా సీదా యువతిలా లక్ కలిసిరావాలి అని మాట్లాడుతుంటే మేనేజర్‌కేం అర్థంకాలేదు.

“బై ది బై మేడమ్ బిజినెస్ మాగ్నెట్ రాఘవేంద్ర నాయుడు గారి అబ్బాయి మధుకర్ గారి అకౌంట్‌కూడా మా దగ్గరే వుంది” గర్వంగా చెప్పాడు బ్యాంక్ మేనేజర్.

“ప్రతి నెలా ఆయనే స్వయంగా వస్తాడా?”

“అవును మాడమ్! మీలాగే ఫస్టుకు వస్తాడాయన.”

“ఎంత వేశాడేమిటి?” కాజువల్‌గా అడిగినట్టు అడిగింది మహతి .

“సారీ మేడమ్! మీలాగే ఆయన కూడా తన ఎకౌంట్‌లో ఎంత మనీ వుందో ఎవ్వరికీ లీక్ చేయొద్దని మరీ మరీ చెప్పారు.”

“ఇట్సాల్ రైట్” లేచింది మహతి .

“వెల్‌కమ్” చిరునవ్వు చిందించాడు బ్రాంచ్ మానేజర్. ఛాంబర్‌లోంచి బయటకొచ్చి, కౌంటర్స్ అన్నీ దాటుకుంటూ వస్తున్న మహతి చూపు, అప్పుడే గ్లాస్ డోర్ తెరచుకుని లోనికొస్తున్న మధుకర్ మీద పడింది.

పక్కకు తప్పుకుందామనుకుంది.

కానీ వీలు పడలేదు.

మహతిని చూడగానే మధుకర్ కళ్ళు విప్పారాయి. కళ్ళతోనే పలకరించాడు మధుకర్ .

ఒక్క క్షణం కాలేజీ కాంపౌండ్‌లోకి యువరాజులా వచ్చే మధుకర్ తలపుకొచ్చాడు.

"హలో .....హౌ ఆర్యూ" మహతే పలకరించింది.

"హలో" తర్వాత ఏమనాలో అర్థం కాలేదు. అంతవరకూ ఎప్పుడూ జ్ఞాపకం రాని సంఘటన -

మహతిపట్ల దుర్మార్గంగా ప్రవర్తించిన సంఘటన గుర్తు కొచ్చింది.

ఆ సంఘటన గుర్తుకు రావడంతో మరి మాట పెగల్లేదు.

"ఒన్ మినిట్ " గబగబా లోపలికెళ్ళి అయిదే అయిదు నిమిషాల్లో బయటికొచ్చాడు.

ఇద్దరూ బయటికొచ్చారు.

"ఎంత వరకొచ్చింది ప్రోగ్రెస్" మహతి అడిగింది.

"గెలుపు నాదే. నీ ప్రోగ్రెస్ ఎంత వరకొచ్చింది ..... " మధుకర్ అడిగాడు.

"గెలుపు నాదే" తను మరింత ధీమాగా చెప్పింది మహతి .

"మన గెలుపుకి బ్యాంక్ ఎకౌంట్‌లో వేసిన మనీ ఒక్కటే క్రైటీరియానా" మధుకర్ అడిగాడు.

"కాదు. జస్ట్ ఇట్స్ ఏ సింబల్ ఓన్లీ."

దగ్గర్లో ఉన్న 'కూల్‌షాప్'లోకి అడుగేశాడు మధుకర్ . అతన్ని మౌనంగా అనుసరించింది మహతి .

ఇద్దరూ  ఎదురెదురుగా కూర్చున్నారు.

"సింబల్ అని ఎందుకన్నానో తెల్సా. ఫర్ ఎగ్జాంపుల్. షైనీ అబ్రహాంనిగానీ, లేకపోతే , ఏ ప్లేయర్‌నైనా తీసుకో. తాము లక్ష్యాన్ని అందుకోవడం కోసం పరుగెత్తుడం ఒకెత్తయితే, అందుకు శారీరకంగా, మానసికంగా చేసే ప్రయత్నం ఒకేత్తు. ఆ ప్రయత్నం చిత్తశుద్ధిగా జరిగినట్టు గుర్తింపు పొందితే చాలు గెలిచినట్టే." కూల్ డ్రింక్ తాగుతూ వివరణ ఇచ్చింది మహతి .

"ఆ మధ్యెప్పుడో సుధారాణీని కలిశావా-"

"కలిశాను"

"ఎందుకు"

జవాబు చెప్పలేకపోయాడు మధుకర్ . బిల్లు తనే చెల్లించింది మహతి .

"మరోసారి సుధారాణిని కలవొద్దు. అలా ..... కలవడం నాకిష్టముండదు." బయటికొస్తూ అంది మహతి .

"ఏం" చటుక్కున మధుకర్ నోటివెంట ఆ మాట వచ్చింది.

"గాంధీ మహాత్ముడిలా నిన్ను నువ్వు టెస్ట్ చేసుకోవాలనుకున్నా, నువ్వు గాంధీవైపోతే ఓకే గానీ ..... తను కాదు. అందుకు."

తనూ ఓ ఆటో పిల్చాడు.

"సీ ..... యూ ..... " ఇద్దరి నోటివెంట, ఒకేసారి, ఒకేమాట.

*　　　　*　　　　*　　　　*

మహతి మాటల్నే తలచుకుంటూ ఆఫీస్ దగ్గర ఆటో దిగాడు మధుకర్ .

ఎదురుగా కన్పించిన దృశ్యానికి ఆశ్చర్యపోయాడు.

మూర్తి- నిధి దయాళ్.

వాళ్ళిద్దరూ కన్పించగానే, ఒక్కసారి యూనివర్శిటీ హాస్టల్‌లో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

అ పరిస్థితిలో తనున్నా అంతేనేమో! ఆ ఆలోచన రావడంతో మనసారా వాళ్ళిద్దర్నీ పలకరించాడు.

"హలో ..... మూర్తీ, నిధీ, ఏమిటలా సడన్‌గా ప్రత్యక్షమయ్యాడు"

"ఏం భయ్యా, సడన్‌గా మమ్మల్ని వదిలేసి వెళ్ళిపోయావ్. నిన్ను ట్రేస్ చేయడానికి ఇన్నాళ్ళు పట్టింది. యాడ్ ఏజెన్సీ పెట్టావట. చూడ్డానికొచ్చాం."

"కమాన్. అసలు నన్నెలా ట్రేస్ చేశారు?" మెట్లెక్కుతూ అడిగాడు మధుకర్.

"నువ్వు కొత్తగా రిక్రూట్ చేసిన స్టాఫ్‌లో. టైపిస్ట్‌గా చేరిన అమ్మాయి. సురేష్‌గాడి కజినట" చెప్పాడు మూర్తి.

" ఆ దారంట వచ్చారన్నమాట"

యాడ్ ఏజెన్సీలో అరగంట సేపు గడిపాక-

"ఇవాళ నిధిగాడి బర్త్‌డేరా ..... నువ్వే చీఫ్ గెస్ట్‌వి. రావాలి" అసలు విషయం నెమ్మదిగా బయటపెట్టాడు మూర్తి.

"సిగరెట్లు, మందూ, పార్టీలు, అన్నీ బంద్-నావల్ల ఉపయోగం ఏం లేదు" నవ్వుతూ అన్నాడు మధుకర్.

"నువ్వు సింపుల్‌గా వచ్చి కూర్చో-నిన్నేం ఇబ్బంది పెట్టం. మరీ హ్రుషీకేశ్‌కి వెళ్ళిపోయినట్టు అందర్నీ వదిలేస్తే ఎలాగ?"

“షార్ట్ ..... సెవనో క్లాక్‌కి వస్తాం ..... బీ ..... రెడీ” నిధిదయాళ్ అన్నాడు.

ఎండిన చెరువు నిండుతోందనే తెలిసే తిరిగి తన దగ్గర వాలారని మధుకర్‌కి తెలీదు. మూర్తి, నిధిదయాళ్ కప్పల్లాంటి వాళ్ళని అంతకంటే తెలీదు.

వాళ్ళిద్దరూ గేటు తెరచుకొని, బయటికి వెళ్ళిపోయాక బొంబాయి నుంచి సుమదేవ్ ఫోన్ రావడంతో రిసీవర్ అందుకొన్నాడు మధుకర్.

* * * *

అన్నపూర్ణా స్టూడియోస్-- ఫోర్త్ ఫ్లోర్ వరండాలో మూడు గంటలుగా నిలబడింది మహతి.

లోన- షూటింగ్ జరుగుతోంది.

అటూ, ఇటూ తిరుగుతున్న జనం, కళ్ళార్పకుండా మహతి వేపు చూస్తూ- గుస, గుసగా ఏదో మట్లాడుకుంటూ వెళ్ళిపోతున్నారు.

“బొంబాయి నుంచి ఈ మధ్య ఎంతమంది హీరోయిన్లు వస్తున్నారో దివ్య, నగ్మా, ఏక్తా, కరిష్మా- ఈ అమ్మాయెవరో.”

ఆ కామెంట్ విని, తనలో తనే నవ్వుకుంది మహతి.

ఇంతలో ఒకాయన లోన్నించి గబగబా వస్తున్నాడు. ఆయన చుట్టూ మనుషులున్నారు. తన పక్కనుంచి వెళ్ళిపోతున్న ఆయనవేపు చూసి-

“సరే. నాగార్జునగారు బయటికెప్పుడొస్తారు” ఆ ప్రశ్న అడిగిన మహతివేపు కళ్ళజోడు సర్దుకుంటూ చూశాడాయన.

“నాగార్జున లోన ఉన్నారని ఎవరు చెప్పారు” ఎదురు ప్రశ్న వేసాడాయన.

“సమ్ ఒన్ టోల్డ్‌మీ” ఏదో చెప్పబోయింది మహతి.

“నో మేడమ్. హీ ఈజ్ నాట్ హియర్. హి ఈజ్ ఎబ్‌ట్ టు కమ్. మరీ అర్జంటయితే ఆ చివర ఆయన గెస్టుహౌస్ వుంది. అక్కడున్నారేమో-- ఎంక్వయిరీ చెయ్యండి” చెప్పి ముందుకెళ్ళి పోయాడాయన.

“వర్మగారూ” ఎవరో వెనకనుంచి కేకవేస్తే ఆగాడాయన. ఆయనే రాంగోపాలవర్మ.

“నాగార్జునగారు ఓ అరగంట తర్వాత వస్తానని చెప్పమన్నారు ..... ఎవరో విజిటర్స్ వస్తున్నార్ట” చెప్పాడు ఆ వచ్చిన వ్యక్తి.

“బహుశా నాగార్జున తన కోసమే వెయిట్ చేస్తున్నారేమో” గెస్ట్ హౌస్‌వేపు పరుగెత్తింది మహతి.

అవును!

అక్కడ నిజంగా రెండు గంటలనుంచి మహతి కోసం నాగార్జున వెయిట్ చేస్తున్నాడు.

నాగార్జున అలా వెయిట్ చేస్తాడని, ఊహించలేదు మహతి.

డ్రాయింగ్ రూంలో--

ఏవో స్టిల్స్ చూస్తున్న నాగార్జున, లోనికి అడుగుపెట్టిన మహతి వేపు చూసి--

“మీరేనా నాకు ఫోన్ చేసిన మహతి.”

అవునన్నట్టుగా తలూపింది.

“టేక్ యువర్ సీట్. టెల్ మీ ఫోన్లో నన్నెందుకు కలవాలనుకుంటున్నారో చెప్పారు! నిజంగా వండరయ్యాను. అందుకే వెయిట్ చేస్తున్నాను. ఒక వ్యక్తి స్వశక్తితో పైకి రావాలని ప్రయత్నిస్తున్నపుడు, ఆ వ్యక్తికి కోపరేట్ చెయ్యడం అవసరం. అలాగే,

మీరు మీ కోసమే కాకుండా, ఒక కుటుంబాన్ని నిలబెట్టారు. ఒక సెన్సేషన్ క్రియేట్ చెయ్యాలని అనుకుంటున్నారని చెప్పారు కదా" అడిగాడు నాగార్జున.

"అవును సర్ జన్నీ ఫాబ్రిక్స్ అని ..... " ఆ కథంతా మళ్ళీ మహతి. చెప్పి-

"ఆ జన్నీ క్లాత్, నలభై ఏళ్ళ పాటు వస్త్ర రంగంలో ఉన్న ఒక వ్యక్తి కృషికి నిదర్శనం సార్- ఆరు కోట్ల రూపాయల ఆ క్లాత్‌ని డ్రెస్ మెటీరియల్‌గా చేస్తున్నాం. ఏ ప్రొడక్టుకైనా పబ్లిసిటీ చాలా అవసరం. ఆ డ్రెసెస్‌లో మీరుంటే, సేల్స్ పాయింటాఫ్ వ్యూలో బావుంటుందనిపించింది-పబ్లిసిటీకి ఖర్చు పెట్టటానికి మా దగ్గర డబ్బు లేదు. అందుకని."

"మీలా ఎప్రోచ్ అయిన వాళ్ళు చాలా తక్కువ. ఐ లైక్ యువర్ నేచర్. ఓ.కే. కేరీ ఆన్. ఐవిల్ ఎగ్రీ ఫర్ యువర్ ప్రపోజల్"

సంతోషంతో ఉప్పొంగిపోయింది మహతి.

"చెప్పండి, ఎప్పుడు ఫోటోలు తీసుకుంటారు."

"ఎప్పుడో కాదు సర్. ఇప్పుడే. మీ కభ్యంతరం లేకపోతే. మళ్ళీ మీరు దొరకడం కష్టం."

నవ్వాడు నాగార్జున.

"మరి డ్రెస్ మెటీరియల్."

"ఐ కేమ్ విత్ డ్రెస్ మెటీరియల్ సర్. లైటింగ్ ఎరేంజ్‌మెంట్స్ అన్నీ జరిగిపోయాయి"

సూట్‌కేసు ఓపెన్ చేసి-

తను తెచ్చిన డ్రెసెస్ అన్నీ బయటకి తీసింది మహతి .

జెన్నీ జాగింగ్ స్పెషల్--

జెన్నీ స్విమ్మింగ్ స్పెషల్--

జెన్నీ డ్రాయింగ్ రూమ్ డ్రెస్--

జెన్నీ ఈవెనింగ్ స్పెషల్--

జెన్నీ నైట్ డ్రెస్--

జెన్నీ జాగింగ్ స్పెషల్ డ్రెస్ వేసుకొచ్చి, సరిగ్గా తనకు తనకు సరిపోయిన కొలతల వేపు ఆశ్చర్యంగా చూస్తూ-

“నా పర్సనల్ టైలర్ స్టిచ్చింగ్‌లా -- కొలతలన్నీ బాగా సరిపోయాయి. ఎలా సంపాదించారు” అడిగాడు నాగార్జున.

“మీ పర్సనల్ టైలర్ దగ్గర్నుంచే-- ” నవ్వుతూ చెప్పింది మహతి.

“యూ ఆర్ ఏ జీనియస్” కాంప్లిమెంట్ ఇచ్చాడు నాగార్జున.

ఫోటోల కార్యక్రమం, రెండు గంటలసేపు నడిచింది. తర్వాత షూటింగ్ కోసం వెళ్ళిపోయాడు నాగార్జున.

మరో గంటలో--

జెన్నీ డ్రెసెస్‌లో నాగార్జున ఫోటో ప్రింట్స్ వచ్చాయి. వాటిని చూసి, నాగార్జునే ఆశ్చర్యానికి లోనయ్యాడు.

“రియల్లీ మార్వలెస్ మిస్ మహతి. ఈ ఫోటోల్ని, మీరు ఏరకమైన పబ్లిసిటీకైనా ఉపయోగించుకోడానికి పర్మిషన్ ఇస్తున్నాను.”అంటూ ఆ ఫోటోల వెనుక సిగ్నేచర్ చేశాడు నాగార్జున.

ఆ సమయంలో నాగార్జున జెన్నీ ఎగ్జిక్యూటివ్ సూట్లో వున్నాడు.

"బై ది బై మిస్ మహతి! మీ పర్మిషన్ లేకుండా మీ సూట్‌తోనే "అంతం" లో ఒక సీన్లో యాక్ట్ చేశాను. నెక్ట్స్ సినిమాకి మా ప్రొడ్యూసర్‌కి మీ "జెన్నీ" నే రికమండ్ చేస్తాను. ఓ.కే."

నాగార్జున వరుసగా అలా మాట్లాడేస్తుంటే, ఆయన సహృదయతకు, మంచితనానికి, వ్యక్తిత్వంతో ఎదిగే యువతరానికి తన వంతు సహాయం అందజేయటానికి సిద్ధంగా ఉండే ఆయన స్వచ్ఛమైన మనసుకు, మనసులోనే జోహార్లు అర్పించింది మహతి.

నాగార్జున అంత లిఫ్ట్ ఇస్తాడని ఊహించలేదు. అందుకే మహతికి ఎక్సయిటింగ్‌గా వుంది. మాటలురాని బొమ్మలా నిలబడిపోయింది.

"సర్ పైసా తీసుకోకుండా ఇంత సహాయం" కృతజ్ఞతో నిండిన కంఠంతో అంది మహతి .

"ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడేందుకు ప్రయత్నచేసేవాళ్ళంటే నాకు గౌరవం. ఆల్ ది బెస్ట్ మహతి " అసిస్టెంట్ డైరెక్టర్ రావడంతో హడావుడిగా వెళ్ళిపోయాడాయన.

"థాంక్యూ సర్" నోట్లో మాటలు నోటిలోనే ఉండిపోయాయి. మనసంతా ఏదో మధురమైన అనుభూతితో నిండిపోయింది.

ఆ అనుభూతినుంచి తేరుకోడానికి అయిదు నిమిషాలు పట్టింది. తేరి చూసేసరికి-

చుట్టూ జనం వాళ్ళని చూచి తత్తరపడింది. వాళ్ళంతా వివిధ సినిమా పత్రికల విలేకరులు. అందులో తెలుగు విలేకరులతోపాటు బోంబే నుంచి వచ్చిన విలేకరులుకూడా ఉన్నారు.

“మేడమ్. నాగార్జునగారిని, అంత ఎట్రాక్ట్ చేసిన మీ జెన్నీ ఫాబ్రిక్స్ గురించి చెప్తారా” ఒక విలేకరి అడిగాడు.

“థాంక్యూ అండ్ సారీ ఫ్రెండ్స్, మీక్కావలసిన డిటైల్స్ అన్నీ చెప్తాను కానీ ఇప్పుడు కాదు. రెండు రోజుల్లో నాగార్జునగరితో జెన్నీ యాడ్ కాంపైన్ స్టార్ట్స్ చేస్తాం. ఆ సందర్భంగా మీకు నేనే స్వయంగా ఫోన్ చేస్తాను-- చాలా అర్జంటు పనులున్నాయి-- వస్తాను--”

గబగబా వెళ్ళి అప్పటికే సిద్ధంగా వున్న ఆటో ఎక్కేసింది మహతి .అప్పటికి మధ్యాహ్నం మూడు గంటలైంది. సరాసరి ఆఫీసుకొచ్చి కూర్చుంది మహతి.

“ రఘురామశెట్టిగారు భువనగిరినుంచి రెండుసార్లు ఫోన్‌చేశారు మేడమ్” అసిస్టెంట్ చెప్పాడు.

“ఇంకా”

“సుధారాణి మీ ఫ్రెండుట, ఫోన్ చేశారు”

“ఇంకా”

తయారుచేసిన ప్రొడక్టు ఎంత గొప్పదయినా, దానికి సరైన రీతిలో ఎడ్వర్టయిజ్‌మెంట్ లేకపోతే ఆ ప్రొడక్టు మార్కెట్లో మనగలగడం కష్టం.

రస్న డ్రింక్ ఫేమస్ కావడానికి కారణం రస్న డ్రింక్ లోని క్వాలిటీ ఒక్కటే కారణం కాదు. అందుకు ఎన్నుకున్న ముద్దు ముద్దు మోడల్ పాప, ఆ యాడ్‌ను అంత ఎట్రాక్టివ్‌గా తయారుచేసిన యాడ్ ఏజన్సీ.

అందుకే--

జన్నీ డ్రెస్ మెటీరియల్‌ని కరెక్ట్ వేలో నావెల్టీగా ప్రెజెంట్‌చేసే యాడ్ ఏజన్సీకోసం చూస్తోంది మహతి.